శిథిలావస్థలో టూరిజం సముదాయం



నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో వస్తూవుంటారు. సాయంత్రం వరకు సంతోషంగా గడుపుతారు. వారిని దృష్టిలో పెట్టుకుని రూ.కోట్లు వెచ్చించి టూరిజం సముదాయం, రెస్టారెంట్, అతిథి గృహాలు నిర్మించారు. వాటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని మూతపడి నిరుపయోగంగా మారాయి. వాటి గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఈ నెల 18, 19, 20 తేదీల్లో సూళ్లూరుపేట కేంద్రంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌కైనా ఆ భవనాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

- నిరుపయోగంగా పెలికాన్ అతిథి గృహాలు
- ఏళ్ల తరబడి మూతపడి ఉన్న టూరిజం రెస్టారెంట్
- బూడిదలో పోసిన పన్నీరైన ప్రజాధనం

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల కేంద్రానికి వెళ్లే రోడ్డులో టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వదేశీ సందర్శయాన్ పథకం (2017–18) కింద 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.3.18 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపట్టారు. వాటిలో ఆరు ఉడెన్ కాటేజెస్, అన్ని సదుపాయాలతో రెస్టారెంట్, పక్షుల పండుగ సీజన్‌లో సందర్శకుల సౌకర్యార్థం పెద్ద వాచ్ టవర్, వాహనాల పార్కింగ్, అందరినీ ఆకట్టుకునేలా ఫుట్‌పాత్, సోలార్ లైట్లు, బెంచీలు, గ్రీన్ గార్డెన్ తదితరాలు ఏర్పాటుచేశారు. ఇందులో ఏ ఒక్కదాన్నీ వినియోగంలోకి తీసుకురాకుండానే వదిలేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం టూరిజం హోటల్‌కు చెందిన పైకప్పు పెచ్చులు ఊడిపోయి శిథిలమైంది. వాచ్‌టవర్ తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఉడెన్ కాటేజెస్ చెదలు పట్టి పనికిరాకుండా పోయాయి.

పీఆర్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన రెండు పెలికాన్ అతిథి గృహాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని స్వాధీనం చేసుకున్న టూరిజం శాఖ అధికారులు స్వదేశీ సందర్శయాన్ పథకం నిధులు రూ.20 లక్షలతో అన్ని హంగులతో నాలుగు గదులుగా తీర్చిదిద్దినా ప్రయోజనం లేకుండాపోయింది. అదేవిధంగా దొరవారిసత్రం మండల కార్యాలయాల సమీపంలో జాతీయ రహదారి వెంబడి 2001–02లో రూ.కోటితో చేపట్టిన టూరిజం హోటల్, షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేసి పర్యావరణ ప్రేమికులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


తుప్పు పట్టి కూలే స్థితిలో ఉన్న వాచ్ టవర్


నిరుపయోగంగా పెలికాన్ అతిథి గృహాలు



డీవీ సత్రంలో నిరుపయోగంగా టూరిజం రెస్టారెంట్

క్లుప్తంగా

నవోదయ పరీక్ష కేంద్రం మార్పు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేటలో ఈ నెల 18వ తేదీన జవహర్ నవోదయలో ప్రవేశానికి పరీక్ష జరగనుందని సూపరింటెండెంట్ చీఫ్, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం.శేఖర్ తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ కారణంగా బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని నారాయణ పాఠశాలకు మార్చామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

శ్రీవారి సేవలో గాయని జోతిర్మయి



రాపూరు : మండలంలోని పెంచలకోన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని బుధవారం ప్రవచన కర్త, గాయని కొండవీటి జ్యోతిర్మయి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె శ్రీవారి కల్యాణ మండపంలో నరసింహ స్వామిని కీర్తిస్తూ పాటలు ఆలపించారు.

ఎన్‌బీకేఆర్‌కు ఘన నివాళి

కోట/వాకాడు : ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, పద్మశ్రీ నేదురుమల్లి బాలక్రిష్టారెడ్డి సేవలు మరువలేనివని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కోట మండలం విద్యానగర్, వాకాడులో బుధవారం ఎన్‌బీకేఆర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వాకాడులోని ఆయన సమాధి వద్ద ఆయన తనయుడు నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి నివాళులర్పించారు. విద్యానగర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నేదురుమల్లి బాలక్రిష్టారెడ్డి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో చింతారవీంద్రరెడ్డి, హరనాథ్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం

చిల్లకూరు : చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని, భోజనానికి ముందు, మల విసర్జన అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలని అదాని క్రిష్ణపట్నం పోర్టు ప్రతినిధులు తెలిపారు. మండలంలోని వరగలిలో బుధవారం క్రిష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చేతులు శుభ్రంగా లేకపోతే ఆహారం తీసుకునేటప్పుడు సూక్ష్మక్రిములు కడుపులోకి చేరి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు.

విజేతలకు బహుమతులు



సైదాపురం : మండలంలోని కలిచేడులో నిర్వహించిన మండల స్థాయి షటిల్ టోర్నమెంట్‌లో విజేతలకు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. నిర్వాహకుడు షేక్ బాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు అందజేసినట్టు పేర్కొన్నారు. నిర్వాహకులు రమేష్, పరశురామయ్య, కిరణ్, శ్రావణ్‌కుమార్, రామిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాగరాజు

చిల్లకూరు : సంక్రాంతిని పురస్కరించుకుని ఏరూరులోని శివగణేష్ క్రీడా మైదానంలో బుధవారం చేవూరు చెంచురామయ్య జ్ఞాపకార్థం మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. చిల్లకూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చేవూరు నాగరాజు మాట్లాడుతూ ఈ పోటీలు 20వ తేదీ వరకు కొనసాగుతాయని, విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌కు రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందజేస్తామని వెల్లడించారు. అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు.

17, 18న వాలీబాల్ టోర్నమెంట్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జీఎస్ఆర్ ట్రస్టు అధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు తెలిపారు. ప్రథమ, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, రూ.25 వేలు ఇస్తామన్నారు. ఇప్పటికే 25 జట్లు నమోదు చేసుకున్నాయని పేర్కొన్నారు. విశ్రాంత పీఈటీ చెంగల్రాయులు, హెచ్‌ఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిల్లకూరు : భార్యపై అలిగి విషం తాగిన వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నెల్లూరు జిల్లా అనంతసాగర మండలం లింగంగుంటకు చెందిన హరిప్రసాద్ (39) పదేళ్ల క్రితం చిల్లకూరు మండలం చేడిమాలలో పెళ్లి చేసుకున్నాడు. సంక్రాంతి పండుగ కోసం భార్య, పిల్లలతో అత్తగారింటికి వచ్చాడు. వారం క్రితం పక్కంటిలో ఉన్న భార్యను పిలిచినా ఆలస్యంగా రావడంతో అలిగి విషం తాగాడు. అతన్ని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

దక్కిలి : మండల కేంద్రమైన దక్కిలి పంచాయతీలో కంభంపాటి వెంకటరమణమ్మపై అదే గ్రామానికి చెందిన చాట్ల బాలకృష్ణయ్య అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

300 కుటుంబాలకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న మేరిగ మురళీధర్, ధనుంజయరెడ్డి

కోట: మండలంలోని ఊనుగుంటపాళెం గిరిజన కాలనీలోని 300 కుటుంబాలకు మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఇందులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేసి ధనుంజయరెడ్డి గొప్ప మనసు చాటుకున్నారని కొనియాడారు. ఎంపీపీ దాసరి అంజమ్మ, నాయకులు కోటారెడ్డి, సుబ్రమణ్యం, నాగూర్‌యాదవ్, హనుమంతరెడ్డి, శివరామ్ నాయుడు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని మేరీ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు బుధవారం శ్రీకాళహస్తి ఎల్ఐసీలో పనిచేస్తున్న శ్రీనివాసరావు దుస్తులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజనం పెట్టారు. కేసీ చంద్రశేఖర్, పరంధామయ్య, మొండెం బాబు బెన్ని, సునిత పాల్గొన్నారు.

కనుల పండువగా కొండ ఉత్సవాలు


శిరసనంబేడులో కొండ ఉత్సవాల్లో పాల్గొన్న భక్త జనం


రోసనూరులో భూపతీశ్వరస్వామికి పూజలు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల్లో బుధవారం సిద్దేశ్వరస్వామి, భూపతీశ్వర స్వామి కొండ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. అనంతరం సిద్ధేశ్వర కొండ, భూపతీశ్వర కొండ చుట్టూ ప్రదక్షిణగా తీసుకెళ్లి కొండ దిగువ నిలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాట కచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచులు గుంటపూడి పెంచలయ్య, శనగ రాజయ్య, నాయకులు శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, వేలూరు మురళీకృష్ణారెడ్డి, దొమ్మరాజు సత్యంరాజు, ప్రసాద్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, రామకృష్ణంరాజు, మోహన్, హరిబాబు రెడ్డి, గోపాలయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాళ్వాయిపాడులో వీర్లయ్య స్వామి గ్రామోత్సవం

తాళ్వాయిపాడులో బుధవారం గ్రామదేవుడు వీర్లయ్య స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమారి కల్పన నాయకులు వీర కుమార్, బాలసుబ్రమణ్యం, బాలయ్య, శ్రీనివాసులు, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

మల్లాంలో వైభవంగా గిరి ప్రదక్షిణ

చిట్టమూరు(చిల్లకూరు) : మల్లాంలోని శ్రీవల్లీ దేవ సేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి గిరి ప్రదక్షిణను బుధవారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గొబ్బిదేవళ్లతో పాటు గిరి ప్రదక్షిణకు సిద్ధం చేశారు. మల్లాంకు ఉన్న తిరుగుడు మల్లాం చెరువుగా గుర్తింపు ఉన్న చెరువు ఆయకట్టు 16 గ్రామాల్లో గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఈ సమయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తొలుత గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల వద్ద నిలిపి పంచ హారతులు ఇచ్చారు. గిరి ప్రదక్షిణలో 16 గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


కలువాయి : కలువాయమ్మ గ్రామోత్సవం


వెంకటగిరి రూరల్ : బంగారుపేటలో కోలాటం


వెంకటగిరి రూరల్ : గౌరమ్మ గ్రామోత్సవం

నాయుడుపేట టౌన్/సైదాపురం/వెంకటగిరి రూరల్/కలువాయి : నాయుడుపేట, వెంకటగిరి పట్టణాలు, సైదాపురం, కలువాయి మండలాల్లో మంగళవారం సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పెద్దలకు కొత్త బట్టలు పెట్టుకుని పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. బుధవారం కనుమ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. పశువులను శుభ్రం చేసి విశేషంగా అలంకరించారు. వెంకటగిరి పట్టణంలోని కాశీతోటలోని కామక్షి సమేత విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతరం గౌరమ్మను కైవల్యానదిలో నిమజ్జనం చేశారు. వెలమపాళెం, బొప్పాపురంలో మహిళలు గౌరమ్మను విశేషంగా అలంకరించి వేడుకలు నిర్వహించారు. బంగారుపేటలో గౌరమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కైవల్యానదిలో నిమజ్జనం చేశారు.


కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నేతల శుభాకాంక్షలు

నాయకులకు శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను నెల్లూరులోని వారి నివాసంలో బుధవారం పలువురు నాయకులు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, గంధవళ్లి సిద్దయ్య, దొంతాల రాజశేఖర్ రెడ్డి, గంధవళ్లి భారత్, పాలేటి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం వెంకటగిరికి వస్తున్నారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యకర్తలు, నేతలతో సమీక్షిస్తారని తెలిపాయి.

పక్షుల పండుగ ఏర్పాట్లపై సమీక్ష

దొరవారిసత్రం : గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ బుధవారం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 18, 19, 20 తేదీల్లో నిర్వహించే పక్షుల పండుగ సమయంలో సందర్శకుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. తిరుపతి సీఎఫ్ సెల్వం, డీఎఫ్‌వో హారిక, డీఎస్పీ చెంచుబాబు, ఎఫ్ఆర్‌వో సౌజన్య, తహసీల్దార్లు శైలకుమారి, రవికుమార్, ఎంపీడీవో గోవర్ధన పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని స్వర్ణముఖి నదిలో బుధవారం నుంచి మూడు రోజులు ఏటి పండుగ నిర్వహిస్తున్న నేపథ్యంలో వెంకటగిరి, మేనకూ రు వెళ్లే వాహనాలను దారి మళ్లించినట్టు సీఐ బాబి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి, మేనకూరు వైపు వెళ్లే వాహనాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాలకు స్వర్ణముఖి నది కాజ్‌వై అనుమతి ఉండదన్నారు. వెంకటగిరి, మేనకూరుకు వెళ్లే వాహనాలు తుమ్మూరు, కొత్తపేట మీదుగా రాకపోకలు సాగించాలని సీఐ కోరారు. స్వర్ణముఖి నది వద్దకు వారు తమ వాహనాలు కాజ్‌వే వద్ద పెట్టరాదని పేర్కొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

చిల్లకూరు/గూడూరు రూరల్ : విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం సంక్రాంతి పండుగ సందర్భంగా చిల్లకూరు మండలం నాంచారమ్మపేట, కడివేడు, నక్కలకాలువ కండ్రిగ, గూడూరులోని శ్రీసాయిరాం వృద్ధాశ్రమంలో దుస్తులు అందజేశారు. వృద్ధాశ్రమానికి తమ వంతు సహకారం అందజేస్తామన్నారు. ట్రస్టు సహ వ్యవస్థాపకులు శిరీష, కార్యదర్శి రామానాయుడు, బాబు, భాస్కర్, అహ్మద్, వెంకటేష్, మస్తాన్ పాల్గొన్నారు.

సైదాపురంలో చోరీ

సైదాపురం : స్థానిక బస్టాండ్ వద్ద అంకయ్య చిల్లర దుకాణంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయాన్నే అంకయ్య అంగడి తలుపు తీశాడు. పైన వేసిన ఇనుప రేకులను కట్ చేసి చోరీకి పాల్పడినట్టు గుర్తించాడు. గల్లా పెట్టెలో ఉన్న రూ.30 వేలు చోరీకి గురైనట్టు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కండలేరులో 56.040 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 56.040 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

నాయుడుపేట టౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా నాయుడుపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గాంధీ పార్కు సమీపంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. వాటిని మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతి, పలువురు మహిళలు న్యాయ నిర్ణేతలు వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పార్థు దంపతులు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్ విజయభాస్కర్ రెడ్డి తదితరులు విజేతలను అభినందించారు. విజేతలకు స్వర్ణముఖి నదిలో జరిగే ఏటి పండుగ వేడుకల్లో బహుమతలు అందజేస్తామని కమిషనర్ ఫేక్ ఫజులుల్లా వెల్లడించారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మకర జ్యోతి దర్శనం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో మంగళవారం రాత్రి మకర జ్యోతి దర్శన పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తారక ప్రభు అయ్యప్ప సేవా సంఘం వ్యవస్థాపకులు కోటకొండ గజేంద్ర సారథ్యంలో గురుస్వామి పద్మనాభ స్వామి పూజలు చేశారు. అనంతరం శబరిమలైలో మకర జ్యోతి దర్శనం జరిగిన సమయంలో అయ్యప్పస్వామి చిత్రపటం ఎదుట కర్పూరం వెలిగించి పూజలు చేశారు. కరీంబాయి, చెంచయ్య మొదలియార్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో శబరిమలై నుంచి ఇద్దరు స్వాములను రప్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం ఎదురుగా క్రేన్‌ను తీసుకువచ్చి అందులో తొట్టె అమర్చి కర్పూర దీపాన్ని వెలిగించి మకర జ్యోతి దర్శనాన్ని కల్పించారు. బుధవారం సాయంత్రం మెట్ల పూజ చేశారు. గురువారం కూడా మెట్లపూజ ఉంటుందని ధర్మకర్త వేనాటి రామచంద్రారెడ్డి తెలిపారు.

వైభవంగా సాయిబాబా తెప్పోత్సవం


భక్తిశ్రద్ధలతో సాయి బాబా 35వ తెప్పోత్సవము నిర్వహిస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరిలోని కుమ్మరిగుంట షిరిడీ సాయిబాబా ఆలయ పుష్కరిణిలో బుధవారం రాత్రి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బాబాను విశేషంగా అలంకరించిన చిలక వాహనంపై కొలువుదీర్చి పుష్కరిణిలో ఊరేగించారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీఐ ఏవీరమణ, ఎస్‌ఐ సుబ్బారావు బందోబస్తు చేపట్టారు.

ఉచితంగా తాగునీటి సరఫరా


మాట్లాడుతున్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: చిల్లకూరు పంచాయతీలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ద్వారా చిల్లకూరు, వడ్డిపాళెం, జీలపాటూరు, దొడ్లవారిమిట్ట గ్రామాల ప్రజలకు ఉచితంగా శుద్ధి చేసిన నీరు సరఫరా చేస్తున్నామని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం చిల్లకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. తాము పంచాయతీ ఆధ్వర్యంలో ఉచితంగా తాగునీరు చేస్తుంటే గిట్టని వారు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ కింద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి 10 లీటర్లను క్యాన్ రూ.20 చొప్పున విక్రయిస్తున్నారని ఆరోపించారు. డబ్బులు వసూలు చేయడం ఆపేసి, ఉచితంగా తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెళ్లకూరు ఎస్‌ఐ తమ పార్టీ కార్యకర్తలను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి బెదిరిస్తున్నారని తెలిపారు. గతంలో స్థానిక సర్పంచ్ ఇంటిపై అర్ధరాత్రి దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, నాయకులు కన్నారెడ్డి పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పొంగళ్లు

రాపూరు: కనుమ పండుగను పరస్కరించుకుని పెనుబర్తి గ్రామస్తులు పోలేరమ్మకు సామూహి క పొంగళ్లు పెట్టారు. మహిళలందరూ మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఓజిలిలో..

ఓజిలి: గుర్రంకొండ గ్రామదేవత చింతాలమ్మకు బుధవారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. మేళ తాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అక్కడ పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారిని వైభవంగా ఊరేగించారు. సర్పంచ్ ముప్పాళ్ల మాధవీలత, మాజీ సర్పంచ్ కొండూరు సురేష్‌రాజు, కొండూరు వామనరాజు, ముప్పాళ్ల మోహన్‌రాజు, ముప్పాళ్ల ప్రతీప్‌రాజు పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి : గ్రామ దేవత తాళ్లమ్మకు గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకున్నారు. ప్రతి ఏటా కనుమ పండుగ రోజు సామూహిక పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమావేశం


39 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని ఏఎల్‌సీఎం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87లో 10 తరగతి చదివిన వారు బుధవారం సమావేశమయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఆర్‌బీఎస్ శాస్త్రి, రాజ్యలక్ష్మి, శంకర్ మూర్తి, సుశీలమ్మ, రామచంద్రారెడ్డికి పాదపూజ చేసి వారి ఆశీర్వాదం అందుకున్నారు. కొంత మంది చిన్నప్పుడు తిన్న బెత్తం దెబ్బలను గుర్తు చేసుకుంటూ మరోసారి ఉపాధ్యాయుల నుంచి బెత్తం దెబ్బలు తిన్నారు. 39 ఏళ్ల తర్వాత అందరూ మళ్లీ ఒకచోట కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు తమ వంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు మదన్‌మోహన్ రెడ్డి, శేషం మునిగోపి, వి.బాలాజీ, వరకుమార్, గంగాధర్, రమేష్, గల్లా శ్రీనివాసరావు, నిక్సన్ అభినందించారు.